ప్రశాంతంగా పాలిసెట్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 27: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 7,254 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. 6,373 మంది పరీక్షకు హాజరయ్యారు. కర్నూలు నగరంలో 4,239 మందికి గాను 3,702 మంది విద్యార్థులు హాజరు కాగా ఆదోని పట్టణంలో 3,015 మందికిగాను 2,671 మంది హాజరైనట్లు బి.తాండ్రపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ ఉమెన్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఏ.చక్రవర్తి తెలిపారు.







రుద్రవరం మండలం నరసాపురం మద్యం షాపు వద్ద క్యూలో ఉన్న మద్యంప్రియులు

మద్యం నిప్వ ఎలాగా అబ్బ...!

మహానంది/ రుద్రవరం, ఏప్రిల్, 27: ఎన్నికల్లో ప్రతి రోజూ మద్యం పంపిణీ చేయడం ఆయా పార్టీలకు తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గత ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో ఎంత వరకు విక్రయాలు జరిగాయో అంతే జరపాలని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు రావడమే ఇందుకు కారణం. ఈ మేరకు టార్గెట్ పూర్తయిన వెంటనే మద్యం దుకాణాలను మూసివేస్తున్నారు. దీంతో ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలకు మద్యం అందించడం కష్టంగా మారింది. సాయంత్రం వేళ గ్రామాల్లో ప్రచారం పూర్తయిన వెంటనే పాల్గొన్న ఆయా పార్టీల కార్యకర్తలు నాయకుల దగ్గరికి వచ్చి మాది మాకిస్తే వెళ్తాం అంటూ క్యూ కడుతున్నారు. వీరికి ఎలా సర్దాలో అర్థంగాక మద్యం పంపిణీ చేసే ఆయా పార్టీ నాయకులు ఇబ్బంది పడుతున్నారు.

- ప్రచారం పూర్తి అయినా వెంటనే మద్యం ఇవ్వాల్సిందే
- తలలు పట్టుకుంటున్న గ్రామీణ స్థాయి నాయకులు
- మందు ఇస్తామంటేనే ప్రచారానికి ..
- ఇంకా పదిహేను రోజులు ఎలా భరించాలి

ఉచిత విద్యుత్ హామీ ఏమాయనో..!



బనగానపల్లె, ఏప్రిల్ 27: సీఎం జగన్ బనగానపల్లె మండలం హుసేనాపురం గ్రామ సభలో ఇచ్చిన హామీని మరచిపోయారు. 1999 ఎన్నికల సందర్భంగా బనగానపల్లె మండలంలో ప్రచారం చేశారు. హుసేనాపురంలో జరిగిన మహిళా సదస్సులో వైసీపీ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు గృహ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా ఆ హామీని నిలబెట్టుకోలేదు. దీంతో మాట ఇచ్చి తప్పడం జగన్‌కు అలవాటేనని ఈప్రాంత ప్రజలు వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు.

నల్లమలలో పోలింగ్ కేంద్రం

- పదేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి చొరవతో ఏర్పాటు
- ఓటు వేయాలంటే 104 కి.మీ. ప్రయాణించాల్సి ఉండేది
- పెచ్చెర్వు చెంచుగూడెంలో ప్రస్తుతం 203 మంది ఓటర్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 27:

నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడేనికి అరుదైన చరిత్ర ఉంది. నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుంచి సుమారు 15 కి.మీ. గల పెచ్చెర్వు చెంచుగూడెం ఒకనాటి చెంచుల రాజధానిగా పేరుగాంచింది. అంతేకాదు బ్రిటీష్ పాలకులు పెచ్చెర్వు కేంద్రంగా విలువైన కలపను దోచుకెళ్లేవారు. ఈ క్రమంలోనే పెచ్చెర్వులో బ్రిటీష్ వారు పలు కట్టడాలను కూడా నిర్మించారు. అయితే సుమారు 37 ఏళ్ల క్రితం నల్లమల అటవీ ప్రాంతం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోకి వెళ్లడంతో పెచ్చెర్వు గూడేన్ని పునరావాసం కింద ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామ పంచాయతీలో గల కొట్టాలచెరువు చెంచుగూడేనికి తరలించారు. ఆ సమయంలో పెచ్చెర్వువాసులకు కొట్టాలచెరువులో ఇళ్ల నిర్మాణాలతోపాటు అటవీ హక్కుల చట్టం కింద వ్యవసాయ భూములను కూడా పంపిణీ చేశారు. అయితే కొట్టాలచెరువు ప్రాంతంలో నివాసం తమ జీవనానికి అనుకూలంగా లేదన్న కారణంతో చాలా మంది తిరిగి పెచ్చెర్వుకి వెళ్లిపోయారు. నల్లమలలోని పెచ్చెర్వులో జనసంచారం వల్ల పులుల సంరక్షణకు ఆటంకం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో వారిని తిరిగి కొట్టాలచెరువుకు తరలించేందుకు నేటికీ అటవీశాఖ అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ క్రమంలోనే అప్పట్లో నల్లమల అటవీ ప్రాంతం కేంద్రంగా మావోయిస్టుల కదలికలు అధికంగా ఉండేవి. దీంతో ఆత్మకూరు నుంచి సుమారు 42 కి.మీ. దూరంలోని పెచ్చెర్వులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్నిక అధికారులు ఎవరూ సాహించలేదు. దీంతో పెచ్చెర్వువాసులకు ఓటు హక్కు ఒక కలగానే ఉండేది.


నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడెం

ఓటు వేయాలంటే..

నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో పోలింగ్ కేంద్రం లేనప్పుడు గూడెం వాసులు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే 104 కి.మీ. ప్రయాణించాల్సిన దుస్థితి ఉండేది. గూడెం నుంచి కాలినడకన 15 కి.మీ. కీకారణ్యంలో నడిచి రోళ్లపెంట ఘాట్ సమీపంలో కర్నూలు-గుంటూరు రహదారికి చేరుకోవాల్సి ఉండేది. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి 27 కి.మీ. దూరంలో ఉన్న ఆత్మకూరుకు చేరుకోవాల్సి ఉంది. ఆ తర్వాత ఆటోలను ఆశ్రయించి మరో 10 కి.మీ. దూరం ప్రయాణిస్తే.. కొట్టాలచెరువుకు చేరుకోవచ్చు. ఇలా ఓటు వేసేందుకు రానుపోను దూరం దాదాపు 104 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. పైగా ఓటు వేయాలంటే వ్యయ ప్రయాసలు భరించాల్సి ఉండేది. దీంతో పోలింగ్ కేంద్రం ఏర్పాటు కాకముందే చాలా మంది పెచ్చెర్వువాసులు తమ జీవితకాలంలో ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితులు ఉండేవి. అయితే పలు ఎన్నికల సందర్భాల్లో ఎన్నికల విభాగం అధికారులే పెచ్చెర్వు ఓటర్లు కొట్టాలచెరువులో తమను ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వాహనాలు, భోజన వసతి కల్పించేవారు. అయినప్పటికీ సుదూర ప్రాంతానికి వెళ్లి ఓటు వేసేందుకు చెంచులు ఆసక్తి చూపేవారు కాదు.



పదేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ చొరవతో...

ప్రజాస్వామ్య వ్యవస్థలో 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న భావనతో అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా పెచ్చెర్వు చెంచుగూడేంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో గూడెంలో 120 మంది ఓటర్లు ఉండేవారు. వీరి కోసం పెచ్చెర్వులో ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పెచ్చెర్వు గూడెంవాసులు తమ ఓటు హక్కును ఉపయోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అసలే నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వులో విద్యుత్, రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలేవి లేనప్పటికీ ప్రతిష్ఠాత్మకంగా పెచ్చెర్వు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలో దిగ్విజయంగా ఓటింగ్ జరిపించారు. కాగా ప్రస్తుతం పెచ్చెర్వు చెంచుగూడెంలో 203 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 93మంది పురుష, 110 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పెచ్చెర్వులో 42 నంబర్ గల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇదిలావుంటే నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో ఎన్నికల ప్రచారం చేసేందుకు కూడా రాజకీయ పార్టీల నాయకులు ఎవరూ వెళ్లకపోవడం గమనార్హం. ప్రతిసారి జరిగే ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ప్రతినిధులను పెచ్చెర్వుకు పంపించి పోల్ మేనేజ్‌మెంట్ జరుపుకుంటున్నారు. ఏదూమైనా.. పెచ్చెర్వు చెంచు గిరిజనులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమని చెప్పవచ్చు.



ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే..

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న భావనతోనే నల్లమలలోని పెచ్చెర్వు చెంచుగూడేంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. కమ్యూనికేషన్ లేని ఏరియాలో పెచ్చెర్వు ఉండటం వల్ల షాడో ఏరియాగా గుర్తించి ప్రత్యేకంగా మైక్రో అబ్జర్వర్లతోపాటు భారీ బందోబస్తుతో పోలింగ్ నిర్వహణ జరిగేలా ప్రణాళిక రూపొందించాం. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కేంద్రాన్ని కొనసాగిస్తాం.

- సుధారాణి, రిటర్నింగ్ ఆఫీసర్, శ్రీశైలం

హలో సార్.. మీ ఓటెవరికి?

కొత్త నంబర్ల నుంచి ఫోన్ కాల్స్



చాగలమర్రి, ఏప్రిల్ 27: ఓ వైపు ఎన్నికల ప్రచారంతో మైకులు మార్మోగుతుండగా మరోవైపు సెల్‌ఫోన్ కాల్స్ హోరెత్తిస్తున్నాయి. రోజుకు ఏడెనిమిది సార్లు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల తరఫున ఫోన్‌లు వస్తున్నాయి. హలో సార్.. మీరు ఏ పార్టీకి ఓటు వేస్తారు, ఏ పార్టీ గెలిస్తే బాగుంటుంది వంటి వివరాలతో విసిగెత్తిస్తున్నారు. బిజీ సమయాల్లో కొత్త నంబర్‌ల నుంచి వస్తున్న కాల్స్ చూసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులని లిఫ్ట్ చేస్తే చివరకు ప్రచార సమాచారం వస్తోంది. దీంతో వెంటనే కాల్ కట్ చేస్తున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

డిజిటల్ పేమెంట్స్ ద్వారా మద్యం విక్రయాలు


మద్యం షాపు వద్ద మందుబాబులు

డిజిటల్ పేమెంట్ ద్వారా మద్యం అమ్మకాల దృశ్యం

నంద్యాల నూనెపల్లె/వెలుగోడు/రుద్రవరం, ఏప్రిల్ 27: వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఇన్నాళ్లకుగాను డిజిటల్ పేమెంట్ ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రెండు రోజుల నుంచి ఫోన్‌పే ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యాన్ని నివారించేందుకు ఈ విధానాన్ని తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది. అయితే ఇంతకాలం సాంకేతిక సమస్యలు చూపించి డిజిటల్ పేమెంట్‌కు నిరాకరించిన మద్యం షాపుల నిర్వాహకులు ఈ సారి ఫోన్‌పే ద్వారా విక్రయాలు జరపాల్సిన పరిస్థితి. ఇదిలాఉంటే మొన్నటి వరకు నగదు మాత్రమే అని చెప్పి ఇప్పుడు ఫోన్‌పే అంటే ఎలా అని మద్యంప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు డిజిటల్ పేమెంట్స్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామని చెప్పారు.

ఐదేళ్లలో చేసింది శూన్యం

- ఎంపీ పోచాను నిలదీసిన చౌట్కూరు గ్రామస్థులు


చౌట్కూరు గ్రామంలో ఎంపీ పోచాను నిలదీస్తున్న గ్రామస్తులు

మిడుతూరు, ఏప్రిల్ 27: ఐదేళ్ల వైసీపీ పాలనలో తమ గ్రామానికి ఒక్క పని కూడా చేయలేదని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని చౌట్కూరు గ్రామస్తులు నిలదీశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో పీరుసాహేబ్‌పేట, మిడుతూరు, చౌట్కూరు తదితర గ్రామాల్లో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో హామీలు ఇస్తారుగాని తమ గ్రామానికి ఒక్క పని కూడా చేయలేదని ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ పోచాను నిలదీశారు. గ్రామానికి దూరంగా పొలాల్లో, రస్తా సరిగా లేని ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని గ్రామ సర్పంచు, వైసీపీ కార్యకర్తలు ఎంపీ ఎదుట వాపోయారు. చౌట్కూరు గ్రామంలో సచివాలయ నిర్మాణం కూడా పునాదులకే పరిమితమైందని అన్నారు. గ్రామంలో ఓ వైసీపీ నాయకుడి నిర్వాహకం వల్లే అభివృద్ధి కుంటుబడిందని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. చౌట్కూరు గ్రామం నుంచి ఓర్వకల్లు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా ఉండంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గ్రామంలో వైసీపీ పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయి మరో వర్గానికి చెందిన నాయకుడిపై విమర్శలు చేసుకోవడం గమనార్హం.

టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఎందుకంటే...!

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: కేంద్ర ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 అమలులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఈ నెంబరుతో అన్ని జిల్లాల్లోనూ కాల్ సెంటర్లను ప్రారంభించింది. ముఖ్యంగా 1950నే ఎందుకు ప్రవేశ పెట్టిందనే విషయం వెనుక ప్రత్యేకత దాగి ఉంది. దేశంలో ఎన్నికల సంఘం 1950లో ఏర్పడింది. అప్పటి నుంచి సార్వత్రిక, స్థానిక సంస్థలు సహా పలు రకాల ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషన్‌ను ప్రారంభించిన సంవత్సరానికి గుర్తుగా ప్రజలు మరువకుండా ఉండేలా ఈ నెంబరును దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

మీ కష్టాలు తీరుస్తాం

చిరు వ్యాపారితో బీసీ జనార్దన్‌రెడ్డి


పండ్లు అమ్మే వ్యాపారి కష్టాలు అడిగి తెలుసుకుంటున్న టీడీపీ బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 27: టీడీపీ అధికారంలోకి రాగానే చిరు వ్యాపారుల కష్టాలు తీరుస్తానని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని కొండపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కళింగర పండ్లు అమ్ముతున్న వ్యాపారిని అడిగి చిరువ్యాపారి కష్ట నష్టాలను గురించి ఆరా తీశారు. పండ్ల ధరలను, వ్యాపారికి గిట్టుబాటు విషయంపై అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చిరువ్యాపారులకు రుణాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటామని బీసీ హామీ ఇచ్చారు.

ఒక నియోజకవర్గం.. రెండు జిల్లాలు

గడివేముల, ఏప్రిల్ 27 : రాష్ట్రంలో జరిగిన జిల్లాల పునర్విభజన ప్రక్రియ నియోజకవర్గ స్వరూపాలను మార్చివేసింది. కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఓటర్ల పరంగా అతి పెద్ద నియోజకవర్గంగా ఉన్న పాణ్యం రెండు జిల్లాలకు విస్తరించింది. 2022, ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం పాణ్యం నియోజకవర్గాన్ని భౌగోళిక విస్తీర్ణాలతో సంబంధం లేకుండా రాజకీయ కారణాలతో కర్నూలు జిల్లాలో కలిపి వేసింది. దీంతో నంద్యాల జిల్లాకు సమీపంలో ఉన్న పాణ్యం, గడివేముల ప్రజలు జిల్లాల పునర్విభజనను నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమాలు చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి పాణ్యం నియోజకవర్గాన్ని రెండు జిల్లాల్లో చేర్చింది. గడివేముల, పాణ్యం మండలాలను నంద్యాల జిల్లాలో, కర్నూలు, కల్లూరు మండలాలతోపాటు కర్నూలు కార్పొరేషన్‌లోని 16 వార్డులను కర్నూలు జిల్లాలో చేర్చింది. గతంలో పాణ్యం నియోజకవర్గంలో పాణ్యం మండలంతోపాటు బనగానపల్లె, వెల్దుర్తి, బేతంచెర్ల మండలాలు ఉండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాలతోపాటు కర్నూలు కార్పొరేషన్‌లోని వార్డులు కలిసి పాణ్యం నియోజకవర్గంగా ఏర్పడింది. పాణ్యం నియోజకవర్గంలో 3,22,493 మంది ఓటర్లలో పాణ్యం మండలంలో 36,893 మంది ఓటర్లు, గడివేముల మండలంలో 34,411 మంది, ఓర్వకల్లులో 48,121 మంది, కల్లూరు మండలంలో 2,03,068 మంది ఓటర్లు ఉన్నారు. పాలన పరంగా రెండు జిల్లాల్లో ఉన్న పాణ్యం నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ కర్నూలు జిల్లా పాలనా అధికారుల పర్యవేక్షణలో సాగుతోంది. రెండు జిల్లాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గ ఓటర్లు నంద్యాల లోక్‌సభ, పాణ్యం అసెంబ్లీ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓట్లు వేయాల్సి ఉంటుంది. 340 పోలింగ్ కేంద్రాలున్న ఈ నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కల్లూరు మండల ఓటర్లు అభ్యర్థుల గెలుపోటములలో కీలక పాత్ర పోషించనున్నారు.



కూల్‌గా ప్రచారం



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: ఎన్నికల పోలింగ్ సమయానికి కౌంట్ డౌన్ మొదలైంది. దీంతో గెలుపు కోసం బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచార స్టైల్ మార్చారు. గతంలో మాదిరిగా ఉదయం 9 నుంచి కాకుండా 7 గంటల నుంచే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టిస్తున్నారు. 11 గంటలకే ముగించి మళ్లీ సాయంత్రం 4 నుంచి 9 వరకు కొనసాగిస్తున్నారు. బహిరగ సభలు కూడా సాయంత్రం సమయంలోనే పెట్టుకుంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు, భవిష్యత్ వ్యూహాలపై చర్చిస్తున్నారు. ఇదే సమయంలో కొందరు పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎండవేడికి భయపడి ప్రచారాలు ఎప్పుడు ముగుస్తాయా అని కేడర్ రోజులు లెక్క పెడతోంది.

ప్రచురణకర్తలూ... జాగ్రత్త

నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లే
మార్గదర్శకాలపై ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ

శిరివెళ్ల, ఏప్రిల్ 27: రాష్ట్రంలో ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు పూర్తిస్థాయిలో ప్రచారంలో నిమగ్నులయ్యారు. ఓటర్లను ప్రభావితం చేసి తమ వైపు తిప్పుకోవడం కోసం గతంలో చేసిన పనులు, అధికారంలోకి వస్తే చేయబోయే పనులు, పలు వాగ్దానాలు ఇస్తుంటారు. రాష్ట్ర నాయకత్వం పంపించిన ప్రచార సామగ్రికి అభ్యర్థులు తయారు చేసుకుంటున్న ప్రచార సామగ్రి తోడవుతోంది. ఇందుకోసం కరపత్రాలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీలు ముద్రిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రచారం తాలూకా ప్రచురణపై ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్-127 ప్రకారం విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లుగా భావించడంతోపాటు చట్టప్రకారం కేసు నమోదు చేస్తారు. ఈ క్రమంలో ప్రచురణలపై ఎన్నికల సంఘం వెలువరించిన ఉత్తర్వులు ఇలా ఉన్నాయి.

- కరపత్రాలు, ఫ్లెక్సీలు, గోడపత్రికలు ముద్రించే వ్యక్తి(ప్రచురణ కర్త) డిక్లరేషన్ తాలూక రెండు ప్రతులను తనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి పొందాలి.
- ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ తాలూకా ఒక ప్రతిని ముద్రించిన ప్రతితో జత చేసి.. రాష్ట్ర రాజధాని అయిన పక్షంలో ప్రధాన ఎన్నికల అధికారికి, జిల్లా కేంద్రంలో అయితే కలెక్టర్‌కు అందజేయాలి.
- ఏ రాజకీయ పార్టీ అయినా, పోటీ చేసే అభ్యర్థి అయినా ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఆరు నెలలు జైలు, రూ.2 వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది.
- పత్రికల్లో ప్రత్యేకంగా ఒక రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా వచ్చే వార్తా కథనాలు, సంపాదకీయాలు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎన్నికల సంఘం సూచనలు జారీ చేసింది.
- ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్-77(1) ప్రకారం ఈ కథనాలకు అయ్యే ఖర్చును సైతం పోటీలో ఉన్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసే అవకాశం ఉంది.
- ఒకవేళ అభ్యర్థి అనుమతి లేకుండా ప్రకటనలు, వార్తా కథనాలు ముద్రిస్తే ఐపీసీ సెక్షన్ 171-హెచ్ ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థి పక్షానైనా ప్రకటనలు ఇచ్చేందుకు లేదా ఏ అభ్యర్థి గురించి అయినా వ్యతిరేకంగా ప్రకటనలు ఇచ్చేందుకు, ముద్రించే వారి పేరు(ప్రచురణ కర్త), ముద్రించిన ప్రకటన ప్రతిని ఈసీ అధికారులకు సమర్పించాలి.





కరువు బండ యాత్ర సమావేశంలో వైఎస్, బొజ్జా, గంగుల, కాటసాని, ఎంవీ మైసూరారెడ్డి (ఫైల్)

రాజకీయ ఉద్దండులు

● యువ రక్తంతో రాజకీయాల్లోకి వచ్చి చక్రం తిప్పిన నేతలు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 27 : రాయలసీమ సాగునీటి సమస్యలపై కర్నూలు, కడప జిల్లాల నేతలు కరువు బండ యాత్ర పేరుతో నిర్వహించిన ఉద్యమంలో నంద్యాలలో సమావేశం నిర్వహించినప్పటి ఫొటో ఇది. 1986-87 మధ్య రోజుల్లో అప్పటి యువ కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డిపాడుకు వెళ్తూ మధ్యలో సమావేశం నిర్వహించారు. ఈ ఫొటోలో ఉన్న అప్పటి యువ నాయకులు.. రాజకీయ ఉద్దండులుగా రాణించారు. మెలివేసిన మీసాలు, జుంపాల జుట్టుతో సమావేశంలో ప్రసంగిస్తున్న వ్యక్తి గంగుల ప్రతాపరెడ్డి. రాజకీయాల్లో యువ కెరటంలా వచ్చి ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా, నంద్యాల ఎంపీగా, రాజ్యసభ సభ్యుడిగా, కాంగ్రెస్ అధిష్ఠానంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తి గంగుల ప్రతాపరెడ్డి. బీజేపీ, టీడీపీలో కూడా గంగుల ప్రతాపరెడ్డి చక్రం తిప్పినప్పటికీ ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. సభా వేదికపై ఆసీనులైన వారిలో కుడివైపు మొదటి వ్యక్తి బొజ్జా వెంకటరెడ్డి, నంద్యాల శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థకు రెండు సార్లు చైర్మన్‌గా పని చేశారు. మరణించే వరకు కాంగ్రెస్ వాదిగా ఉన్న రాజకీయ ఉద్దండుడిగా బొజ్జాకు రాజకీయ రంగంలో పేరు ఉంది. బొజ్జా పక్కన కూర్చున్న వ్యక్తిని చూడండి.. నూనూగు మీసాలతో, యువతేజంతో అప్పట్లోనే చక్రం తిప్పి, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన నేతగా పేరుగాంచిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. వైఎస్ పక్కన చిన్నపాటి క్రాఫ్‌తో, వచ్చిరాని గడ్డంతో కూర్చున్న వ్యక్తి కాటసాని రాంభూపాల్‌రెడ్డి. రాజకీయాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ ఉద్దండుడిగా పేరుగాంచారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా పాణ్యం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు. చివరగా కూర్చున్న వ్యక్తి సన్నటి మీసాలు, రింగుల జుట్టుతో ఉన్న వ్యక్తిని నిశితంగా చూడండి. కాంగ్రెస్‌లో ఉన్నా, టీడీపీలో ఉన్నా, వైసీపీలో ఉన్నా కేంద్ర పాలక మండళ్లలో చక్రం తిప్పారు. మాజీ హోం శాఖ మంత్రిగా పని చేశారు. ఆయనే సీనియర్ నాయకుడు ఎంవీ మైసురారెడ్డి. వీరంతా అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వీరి వెనుక చేతికింద చిన్నపాటి బ్యాగ్‌ను పెట్టుకొని ఉన్న వ్యక్తి నంద్యాల పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు లగిశెట్టి సుబ్బగురుమూర్తి. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఐదు దశాబ్దాలు కొనసాగారు.

వీధుల్లో తిరిగే కెమెరా..!



నిఘా బృందం సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 27: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆధునాత కెమెరాలతో నిఘా బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. కర్నూలు జిల్లాలోని 8 నియోజకవర్గాలలో 68 ఫ్లయింగ్ స్క్వాడ్ టీఎం(ఎఫ్ఎస్‌టీ)ల వాహనాలకు అత్యాధునికమైన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాహనాలకు పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఆ వాహనం ప్రయాణిస్తున్న ప్రదేశాలకు సంబంధించి నిరంతర ప్రత్యక్ష వీడియో కవరేజ్‌కు వీలవుతుంది. ఈ వీడియో కవరేజ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌లో ఉన్న ఎఫ్ఎస్‌టీ బృందాలు ఎన్నికల పనితీరును పర్యవేక్షిస్తారు. కెమెరాలు ఏర్పాటు చేయడం వద్ద ఏదైనా ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా సమావేశాల నిర్వహణ, ఓటర్లకు డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు గురిచేసే వారిపై ప్రతిబంధకంగా పని చేస్తాయి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కెమెరాలను ఏర్పాటు చేసింది. ప్రతి వాహనంలో ఓ అధికారి, ఒక ఏఆర్ పోలీసు, సివిల్ పోలీసుతో పాటు వీడియోగ్రాఫర్ ఉంటారు.



కారు టాప్‌పైన సీసీ కెమెరా

ఎమ్మెల్యే శ్రీదేవి మాటలు నమ్మి మోసపోయామని జనాలు చర్చించుకుంటున్నారు. హామీ ఇచ్చినట్టుగా అభివృద్ధి చేస్తారనుకుంటే ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దికెరలో సాయినగర్ కాలనీ ఏర్పడి 25 ఏళ్లయింది. 'ఇక్కడ మౌలిక వసతుల గురించి ఎవరూ కూడా పట్టించుకోలేదు.. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కాలనీలో ఉచితంగా ఇంటింటికి కొళాయిలు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు వేసి అభివృద్ధి చేస్తా' అని 2019 ఎన్నికల ప్రచారంలో అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హామీ ఇచ్చారు. అభివృద్ధి చేయకపోతే.. ఓట్లు అడిగేందుకు కూడా రానని గట్టిగా చెప్పడంతో ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. గెలిచి ఎమ్మెల్యే అయ్యాక.. ఆ హామీని పట్టించుకోలేదు. ఐదేళ్లు నిర్లక్ష్యం చేసి తీరా ఎన్నికల ముందు నాలుగు నెలల క్రితం పైపులైన్ పనులు ప్రారంభించారు. ఎన్నికలు వచ్చేలోపు ఇంటింటికి నీరందిస్తామని నమ్మబలికి ఆ పనుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. ప్రజలు దీంతో అసహనం వ్యక్తం చేసి నమ్మి మోసపోయామన్న ఆవేదనలో ఉన్నారు.

- మద్దికెర




నత్తనడకన నడుస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు పనులు

● హామీని విస్మరించిన ఎమ్మెల్యే శ్రీదేవి
● ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని సాయినగర్ కాలనీ
● గుక్కెడు నీరు కరువే..



నమ్మి మోసపోయాం

మద్దికెర గ్రామంలోని సాయినగర్ కాలనీలో దాదాపు 450 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీ అభివృద్ధి చెందినప్పటికీ రోడ్లు లేవు, డ్రైనేజీలు లేవు.. తాగేందుకు గుక్కెడు నీరు కూడా లేదు. దీంతో ప్రజలందరూ కాలనీలోని సుంకులమ్మ దేవాలయం వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎమ్మెల్యే శ్రీదేవి దేవాలయ ప్రాంగణంలో సాయినగర్ కాలనీకి రోడ్లు వేస్తానని, ఇంటింటికీ ఉచితంగా కొళాయి కనెక్షన్లు ఇస్తామని.. లేకపోతే తనకు ఓటు వేయవద్దంటూ.. గత ఎన్నికల సమయంలో ప్రగల్బాలు పలికారు. పార్టీ అధికారంలోకి రాగానే ఏమాత్రం సమస్యను పట్టించుకోలేదు. తాగునీటి సమస్యపై రెండేళ్ల కిందట ఎమ్మెల్యే మద్దికెర వస్తుంటే.. కాలనీవాసులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే కారును అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పట్టించుకోకుండా తమ కాలనీ వైపు తిరిగి చూడలేదు. దీంతో కాలనీవాసులు ఆగ్రహంతో ఉన్నారు. గమనించిన ఎమ్మెల్యే శ్రీదేవి నామ్‌కేవాస్తేగా కాలనీకి సీసీ రోడ్లు వేయడానికి రూ.55 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలనీలో మూడు రోడ్లు వేశారు. అది కూడా నాసిరకంగా డ్రైనేజీలు లేకుండా వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్ పథకం కింద మద్దికెరకు రూ.1.85 కోట్లు నిధులు మంజూరు కావడంతో సాయినగర్ కాలనీలో పైపులైన్ వేశారు. 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నప్పటికీ ఐదు నెలలైనా ముందుకు సాగడం లేదు. ఎన్నికల్లో నీరు ఇచ్చి హామీ నిలబెట్టుకుంటామని నమ్మబలికారు. పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వేసవి కాలం గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ప్రజలను ఇంకా నమ్మించాలని చూస్తున్నారు. హామీలు ఇచ్చి విస్మరించిన శ్రీదేవమ్మను ప్రజలు ఎలా నమ్ముతారో వేచి చూడాలి మరి.



డ్రైనేజీలు, నీరు లేవు



సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్లు వేశారు కానీ.. డ్రైనేజీలు లేవు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గుక్కెడు నీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇంటింటి కొళాయి ఎప్పుడు ఇస్తారో వారికే తెలియాలి.

శ్రీనివాసులు, కాలనీవాసి

అంతా హంగామానే



ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించండి.. ఉచితంగా ఇంటింటికి కొళాయి ఇస్తాం.. రోడ్లు, డ్రైనేజీలు వేస్తాం అంటూ హామీ ఇచ్చి హంగామా చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు నిద్రపోయి ఎన్నికలు ముందుకు రాగానే పనులు మొదలు పెట్టారు. మిమ్మల్ని ఎలా నమ్మాలి అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

- మాబాషా, కాలనీవాసి



మురుగు కాలువ లేకుండా వేసిన సీసీ రోడ్డు

అభివృద్ధికి నోచుకోని సాయినగర్ కాలనీ ఇదే



గతమెంతో ఘనం

● ఒకనాటి ఆంధ్ర రాష్ట్ర రాజధాని కర్నూలు
● తొలిసారిగా దామోదరం సంజీవయ్య, ఎం.శంకర్‌రెడ్డి ద్విసభ్యుల ఎంపిక
● హ్యాట్రిక్ సొంతం చేసుకున్న ఏకైక ఎమ్మెల్యే రాంభూపాల్ చౌదరి

కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంగా 1952లో ఏర్పడింది. ఆనాటి ఎన్నికల్లో కర్నూలు నుంచి దామోదరం సంజీవయ్య, ఎం.శంకర్‌రెడ్డిలు ద్విసభ్యులుగా ఎంపికై మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలో తొలిసారిగా అడుగు పెట్టారు. అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజాగోపాలాచారి (రాజాజీ) క్యాబినెట్‌లో దామోదరం సంజీవయ్య హౌసింగ్, కో-ఆపరేటివ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత ద్విసభ్యత్వం రద్దయింది. 1955లో జరిగిన ఎన్నికల్లో ఎంఏ ఖాన్ ఎమ్మెల్యేగా గెలిచారు. 1952 నుంచి 2019 వరకు 15 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ద్విసభ్యులతో కలిపి 16 మంది ఎమ్మెల్యేలుగా ఎంపికై అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించాక 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వి.రాంభూపాల్‌చౌదరి విజయం సాధించారు.


● ముగ్గురు మంత్రులు:

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి 15 పర్యాయాలు ఎన్నికలు జరిగితే 12 మంది ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన వి. రాంభూపాల్‌చౌదరి తరువాత కాంగ్రెస్‌లో చేరారు. 1985, 1989లోనూ వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్న ఏకైక ఎమ్మెల్యే రాంభూపాల్ చౌదరి. రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ 1999, 2009లో రెండు సార్లు, సీపీఎం సీనియర్ నాయకుడు ఎంఏ గఫూర్ 2994, 2004లో రెండు సార్లు విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పడ్డాక తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన దామోదరం సంజీవయ్య మద్రాసు రాష్ట్రం సీఎం రాజాజీ ప్రభుత్వంలో హౌసింగ్, కో-ఆపరేటివ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 35 ఏళ్ల తరువాత వి.రాంభూపాల్‌చౌదరి సీఎం ఎన్.జనార్దన్‌రెడ్డి క్యాబినెట్‌లో సహకార శాఖ, సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి క్యాబినెట్‌లో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు. 20 ఏళ్ల తరువాత ఉమ్మడి రాష్ట్రం చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లో టీజీ వెంకటేశ్ చిన్నతరహా నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.



టీడీపీకి కంచుకోట పత్తికొండ

పత్తికొండ, ఏప్రిల్ 27: టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన తొమ్మిది సార్వత్రిక ఎన్నికలు, ఒక ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థులే ఏడు సార్లు విజయం సాధించారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మారెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మహాబలేశ్వరగుప్తా గెలిచారు. అయితే రెండు నెలలు గడవకముందే ఆయనను ప్రత్యర్థులు హత్య చేశారు. ఆతర్వాత జరిగిన ఉప ఎన్నికలో గుప్తా సతీమణి సుబ్బరత్నమ్మ టీడీపీ అభ్యర్థిగా గెలిచారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శేషిరెడ్డి గెలిచారు. 1994లో టీడీపీ అభ్యర్థి ఎస్వీ సుబ్బారెడ్డి విజయం సాధించారు. ఆతర్వాత 1999, 2004 ఎన్నికల్లో కూడా ఆయన టీడీపీ అభ్యర్థిగా గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి కేఈ ప్రభాకర్, 2014 ఎన్నికల్లో కేఈ క్రిష్ణమూర్తి టీడీపీ అభ్యర్థులుగా గెలిచారు. 1994 నుంచి 2014 వరకు వరుసగా ఐదు సార్లు విజయం సాధించిన టీడీపీ 2019లో ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శ్రీదేవి గెలిచారు.



పైన గాంభీర్యం... లోలోన గుబులు...!



ఆదోని, ఏప్రిల్ 27: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని వ్యూహాలు రచిస్తున్నారు. పైకి గాంభీర్యంగా కనిపిస్తున్నా.. లోలోపల గుబులుగానే ఉన్నారు. ఏ పార్టీ ఏ వర్గం ఓట్లకు ఎసురు పెడుతుందోనని లెక్కలేసుకుంటున్నారు. దాని ప్రకారం ఆ వర్గపు ఓట్లు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.

● ప్రతి పార్టీలోనూ చేరికలు...

ప్రతి పార్టీలోనూ చేరికలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్ని కండువాలు ఎవరికి కప్పారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. తమ పార్టీలో చేరి కండువాలు కప్పుకున్న వారంతా ఓట్లు వేస్తారని భావించరాదని అభ్యర్థుల అనుచరులు హెచ్చరిస్తున్నారు. మీవెంటే మేమున్నామంటూ భరోసా ఇచ్చిన వాళ్లు రాత్రికి రాత్రి పార్టీలు మారడం, సోషల్ మీడియాలో వైరల్ కావడం వంటి పరిణామాలతో అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దిద్దుబాటు చర్యలకు అభ్యర్థులు పరుగులు పెడుతున్నారు. పార్టీ మారుతున్నట్టు ప్రచారం జరిగిన వ్యక్తులతో మంతనాలు సాగిస్తున్నారు. ఎ

● ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి....

పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు ప్రచారాలతో పాటు ప్రలోభాలకు తెరలేపుతున్నారు. ముఖ్యంగా పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రతి వార్డులో 10 నుంచి 15 మంది దాకా నమ్మదగిన వ్యక్తులను ఏర్పాటు చేసుకుని ఓటరు స్లిప్పుల పేరుతో ఇతర కారణాలతో ప్రతి ఇంటికి వెళ్లడం, వారితో మాట్లాడి తాయిలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.

హలో.. అన్నా నమస్తే.. ఊరికి రండి



ఆలూరు, ఏప్రిల్ 27: నమస్తే అన్న అక్క బాగున్నారా.....? ఏ ఊర్లో ఉన్నారు. ఎన్నికలు మే 13న ఉంటాయి. మీరు తప్పకుండా ఊరికి రావాలి. మీతోపాటు ఎంత మంది మన ఊరు వాళ్లు ఉన్నారు. వాళ్ళ ఫోన్ నెంబర్లు ఇవ్వండి... వాళ్లను కూడా అడిగాను అని చెప్పండి. మళ్ళీ మేమే వాళ్లకి కాల్ చేస్తాం. మీరు రెండు రోజులు ముందే రండి... మీరు ఎంత మంది ఉన్నారో చెబితే చార్జీలకు డబ్బులు ఫోన్‌పే ద్వారా వేస్తామంటూ బెంగళూరు, ముంబై, గుంటూరు, హైదరాబాద్, వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి ప్రధాన పార్టీల అభ్యర్థుల అనుచరులు వల వేసి ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నారు. మన అభ్యర్థికి తప్పకుండా ఓటు వేస్తే మీకు ఎన్నికలకు ముందే మీ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయో చెబితే అన్ని ఓట్లకు డబ్బులు ఇచ్చేస్తాం. అంటూ వారికి టచ్‌లో ఉంటున్నారు. ఓటరు జాబితాలో వలస ఓటర్ల పేర్లు, సీరియల్ నెంబర్, బూత్ నెంబర్ తీసుకొని జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఇదేం మేనిఫెస్టో..

● సీఎం జగన్‌పై సర్వత్రా విమర్శలు

వైసీపీ మేనిఫెస్టో నవ్వులపాలు



వైసీపీ మేనిఫెస్టో నవ్వులపాలైంది. ప్రస్తుతం వృద్ధులకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.3,500 పెంచేందుకు రెండు దఫాలుగా ప్రకటించారు. నాలుగేళ్లకు రూ.250 పెంచి మరో ఎన్నికల ఏడాది మరో రూ.250 పెంచడం దారుణం ఇది ప్రజలకు మోసం చేయడ కాక మరేమిటి. అన్నీ పాత పథకాలే. టీడీపీ మేనిఫెస్టోకు ఏవీ సరికావు.

- రామకృష్ణ, జిల్లా తెలుగు యవత మాజీ ఉపాధ్యక్షుడు గాజులదిన్నె

నమ్మి మోసపోయారు



ఒకసారి జగన్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారు. అమ్మఒడి పథకం అమలులో గతంలోనే జగన్ ప్రభుత్వం ఒక విద్యార్థికి రూ.15వేలు అన్నారు. తీరా చేస్తే రూ.13వేలకు కుదించారు. ఇది నిజం కాదా? ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ రూ.15వేలు అమ్మ ఒడి రాలేదు. ఇద్దరికి ఇస్తామని ఒక్కరికే మితం చేశారు. ఇప్పుడు రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచుతున్నామంటే నమ్మకం కుదరదు. మరోసారి జగన్‌ను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు.

- చెన్నలరాయుడు, గోనెగండ్ల



గోనెగండ్ల, ఏప్రిల్ 27: పేద ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా వైసీపీ మేనిఫెస్టో ఉంటుందని ఆ పార్టీ నాయకులు ఇటీవలి కాలంలో తెగ ఉపన్యాసాలు ఇచ్చారు. అయితే శనివారం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజల నుంచి వ్యతిరేక స్పందన వస్తోంది. పాత పథకాలను కొనసాగించడం తప్ప మరో కొత్త ఏమీలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ ప్రస్తుతం రూ.3000 ఇస్తున్నారు. అదీ కూడా 2028లో రూ.250 2029లో మరో రూ.250 పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇలా మేనిఫెస్టో మొత్తం చెత్తగా మారిందంటూ ఓటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన ట్యాక్స్‌లకే వాహన మిత్ర సరి



ట్యాక్సీ, ఆటో ఉన్న వారికి ప్రతి ఏడాది వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.10వేల ప్రకారం ఐదేళ్లకు రూ.50 వేలు ఇచ్చారు. కానీ అదేరీతిలో ట్యాక్స్‌లు కూడా పెంచారు. ఇలా ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో ట్యాక్సుల రూపంలో లాక్కున్నారు. ఇక వాహనదారుడికి ఏం లాభం. ప్రస్తుతం ఉన్న వాహన మిత్ర పథకమే చాలామందికి సక్రమంగా అమలు కాలేదు.

- మాబు, గోనెగండ్ల

ఈ ఏడాది రైతు భరోసానే అమలు కాలేదు



ఈ ఏడాది రైతులకు రైతుభరోసా పథకం కింద డబ్బులు విడుదల కాలేదు. గత ఏడాది రైతు భరోసా కింద రూ.13,500 ఇచ్చారు. అయితే ఈ ఏడాది రైతు భరోసా ఇవ్వలేదు. రైతులు ఎదురుచూసి మోసపోయారు. సక్రమంగా ఇవ్వని పథకానికి ఈ మేనిఫెస్టో డబ్బులు పెంచుతామంటే నమ్మే స్థితిలో రైతులు లేరు. రూ.16వేలు ఇస్తామంటే నమ్మకం కుదరడం లేదు.

-కౌలుట్లయ్య నాయుడు గోనెగండ్ల

మళ్లీ వైసీపీ వస్తే అరాచకమే

టీడీపీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్



ఎస్పీసీ 95 అభ్యర్థుల ఆత్మీయ సమావేశంలో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 27: రాష్ట్రంలో మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికా రంలో అరాచకమేనని టీడీపీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని జోహరాపురంలోని మాగేరిలో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు పించన్లు, డ్రైనేజీలు, తదితర సమస్యలను టీజీ భరత్‌కు మొరపెట్టుకున్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ప్రజలకు ఇబ్బందులు మిగిల్చిన వైసీపీని మళ్లీ ఎన్నుకుంటే ఈ సమస్యలు ఇలాగే మిగిలి పోతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నాయకులు మోహన్, మాదవస్వామి, తిమ్మోజీ, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ గౌడ్, తిమ్మప్ప, విజయుడు, రామ్ ప్రతాప్, కౌలుట్లయ్య, భాస్కర్, నాగరాజు, ఆవేజ్, అబ్దుల్లా, శాంతమ్మ, చిట్టెమ్మ, అనిత, రఫీక్, శ్రీను, నాయుడు, అస్లాం అశోక్, సికిందర్, తిరుపతయ్య, బాలస్వామి, జనసేన నాయకులు పవన్ పాల్గొన్నారు,

● **వైసీపీ మరోసారి మోసం చేయాలని చూస్తోంది :** వైసీపీ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని టీజీ భరత్ అన్నారు. శనివారం మౌర్యఇన్‌లోని పరిణయా హాలుల్లో ఎస్పీ 95 గ్రూప్ సభ్యుల ఆత్మీయ సమావేశంలో టీజీ భరత్ పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో ముస్లిం. క్రిష్టియన్ అని కులం, మతాల పేర్లు చెప్పి గెలిచిన వైసీపీ మరో సారి ఆదే దారి లో గెలివాలని చూస్తోందన్నారు. అయితే ఈ ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదు ర్కొన్న ప్రజలు వైసీపీని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఏంసీ ఆదేప్ప, శ్రీను, నాగరాజు, బి. శ్రీనివాసులు, ఎల్లకృష్ణుడు, ఎస్సీ 95 గ్రూప్ సభ్యు లు, టీడీపీ నగర ఎస్సీసెల్ నాయకురాలు శారదమ్మ, నాయకులు విక్రమ్ సింగ్, శ్రీధర్ పాల్గొన్నారు,

● టీడీపీలో చేరిక: కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌కు చెందిన యువకులు టీడీపీలో చేరారు. శనివారం టీజీ భరత్ కార్యాలయంలో ఆయన్ను కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి టీజీ భరత్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మా ట్లాడుతూ టీడీపీ ఆధికారంలోకి వస్తే యువతకు బంగారు భవిష్యత్ ఉంటు ందన్నారు. టీడీపీ యువ నాయకులు సాయి ఆధ్వర్యంలో యశ్వంత్, వీరేంద్ర, హరి, లక్ష్మణ్, కన్నా హుస్సేన్, తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన కర్నూలు ఇన్‌చార్జి అర్షద్ పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న టీజీ భరత్

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా నాయకులు

గూడూరు, ఏప్రిల్ 27: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి పిలుపునిచ్చారు. శనివారం గూడూరులో పర్యటించిన టీడీపీ నాయకులు ఆదివారం గూడూరులో చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. చంద్రబాబు ఆదివారం సాయంత్రం గూడూ రులో పర్యటిస్తారని, అందుకు సంబంధించి హెలిప్యాడ్, పాతబస్టాండు ప్రాంతంలో నిర్వహించే సభను, రాత్రి బస ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు, సృజన్, పౌలు, సుమన్‌బాబు, తెలుగు శ్రీనివాసులు, విజయ్ కుమార్, గిడ్డయ్య పాల్గొన్నారు.

● చంద్రబాబు పర్యటనను జయప్రదం చేద్దామని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు పిలుపునిచ్చారు.

నైతిక విలువల్లేని జగన్

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఎన్డీయే చార్జిషీటు విడుదల చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 27: నైతికత విలువల్లేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఎన్డీయే చార్జిషీటు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.10లక్షల భారం మోపిన ఘనత సీఎం జగన్‌కే దక్కింద న్నారు. ల్యాండ్, ఇసుక, మైనింగ్, గంజాయి, డ్రగ్స్‌తోపాటు రేషన్ బియ్యంలో రూ.8 లక్షల కోట్లు వైసీపీ కొట్టేసిందని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని విక్రయించి రాష్ట్రంలో 35 లక్షల మంది ఆరోగ్యాలను పాడు చేసి 30వేల మంది మహిళల తాళిబొట్లను వైసీపీ పాలకులు తెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని జగన్ మాట ఇచ్చి నేరుగా ప్రభుత్వమే రూ.లక్ష కోట్ల మద్యం అమ్మి దోచుకోవడం దారుణమన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేసి జగన్ పేదల కడుపు కొట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.లక్షల కోట్లు దారి మళ్లించిందన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, వేణు, అన్వర్ పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిన మహిళలు

కల్లూరు, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని టీడీపీ పాణ్యం అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం కల్లూరు మండలం కే.మార్కాపురం, బస్తిపాడు, పర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన టీడీపీ మేనిఫేస్టోను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ధ్వజమెత్తారు. వివిధ కులాలకు చెందిన కార్పొరేషన్లకు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మించి నిరుద్యో గులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, పాండు, రామనాయుడు, బస్తి పాడు నాయకులు రాజు, సురేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి. లక్ష్మన్న, ప్రతాప్, పర్ల నాయకులు రామగిడ్డయ్య, ఎంపిటీసీ మేకల శేషన్న, మహానంది, మాజీ ఎంపిపి వాకిటి మాధవి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: కే.మార్కాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయ కుడు లక్ష్మిరెడ్డితోపాటు పలు కుటుంబాలు గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌కు చెందిన నిర్మల, పెద్దక్క, ఆదిలక్ష్మీ, సావిత్రితోపాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వార్డు నాయకుడు తలారి కృష్ణ పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 26, 27 వార్డుల్లో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎన్నికల మేనిఫేస్టోను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కేతూరుమధు, చరణ్, శ్రీరాములు పాల్గొన్నారు.

● టీడీపీ జిల్లా కోశాధికారి, కల్లూరు అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న ఆధ్వర్యంలో 35వ వార్డులో గౌరు చరితను గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రవిప్రకా ష్‌రెడ్డి, 32వ వార్డు ఇన్‌చార్జ్ టైలర్ నాగరాజు, మౌలాలి, ఖాజా బందెన వాజ్, సోమన్న, ఎల్లనాగన్న, కృష్ణనాయుడు పాల్గొన్నారు.



కె.మార్కాపురం, బస్తిపాడు, పర్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరు చరిత

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 27: ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి నవీన్ పాటిల్ డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ సీఈవో నాసరరెడ్డిని వారు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాలలో జమ కానీ నెలవారి ఖాతా కంతులు వెంటనే జమ చేయాలన్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రిటైర్మెంట్ దగ్గరున్న ఉపాధ్యాయులు పార్ట్ ఫైనల్ బిల్స్ వెంటనే చెల్లింపునకు పంపాలని కోరారు. జడ్పీ సీఈవో సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయ కులు హేమంత్ కుమార్, యెహోషువ, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, జయరాజు, మారెప్ప, హనుమంతు, కాంతారావు, సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువ తెలుసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 27: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకోవాలని ఎన్నికల సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు 2024 పురస్కరిం చుకుని శనివారం నగర పాలక సంస్థ అధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. 248 నుంచి 258 పోలింగ్ స్టేషన్ల వరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. కమ్యూనిటీ ఆర్గ నైజర్లు, రీసోర్స్ పర్సన్, బీఎల్‌ఓలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, ఏప్రిల్ 27: మండలంలోని కంబంధహల్ గ్రామంలో తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బోర్లలో తాగునీరు పూర్తిగా అడుగంటిపోయిందని, తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ సమీపంలోని వంక వద్ద బోరు ఏర్పాటు చేసి గ్రామానికి తాగునీరు అందజేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తాగునీరు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచిం చారు. అనుమతి లేని కొళాయిలను రద్దు చేయాలని సర్పంచుకు ఆదేశించారు. ఆయన వెంట ఈవోఆర్డీ సందీప్, సర్పంచ్ చిన్న ఈరమ్మ ఉన్నారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 27: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2023 డిసెంబర్‌లో జరిగిన బీఈడీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను డీన్ సుందరానంద పుచ్చా విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 2828కు 2591 మంది విద్యార్థులు, సప్లిమెంటరీ పరీక్షల్లో 518 మంది దరఖాస్తు చేసుకోగా 440 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి పెట్టాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 27: ఇంజనీరింగ్ విద్యా ర్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఇస్రో శాస్త్రవేత్త జయేం ద్ర బుషిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వెంకాయపల్లె జి.పుల్ల య్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో శాస్త్ర వేత్త జయేంద్ర బుషిరెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రోలో రాణించాలంటే స్కిల్స్‌ను ఏ విధంగా సాధించాలో వాటి వివరాలను విద్యార్థులకు వివ రించారు. చంద్రయాన్-3 కోసం ఇస్రో పాటుపడిన అనుభ వాన్ని శాస్త్రవేత్త విద్యార్థులతో పంచుకున్నారు. కళా శాల ప్రిన్సి పాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు దేశా నికే గర్వకారణమన్నారు. డా.ఎస్.సుమన్ ప్రకాష్, విడీ న్ అడ్మిన్ గిరిధర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బ్రాహ్మణుల పురోభివృద్ధి

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 27: చంద్రబాబుతోనే బ్రాహ్మ ణుల పురోభివృద్ధి అని జిల్లా బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మం డలి అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం నగరంలో ని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటీవల కర్నూలు పర్యటనకు వచ్చిన వైసీపీ దేవదాయ శాఖ సలహాదారు శ్రీకాంత్ బృందం తమ ప్రచా రంలో ఒకటికి మించిన మరొక అబద్ధాల పరంపర కొనసాగించార ని ఆరోపించారు. దేశంలో తొలిసారిగా చంద్రబాబు బ్రాహ్మణులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పేద బ్రాహ్మణులకు చేయూత అందించారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికా ర కమిటీ సభ్యుడు సముద్రాల శ్రీధర్ బాబు, టీడీపీ కర్నూలు పార్లమెంటరీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు టీవీ రవిచంద్ర శర్మ, టీడీపీ కర్నూలు అసెంబ్లీ కమిటీ సభ్యుడు దావణగేరి ఆనందరావు, ఏపీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, టీడీపీ బ్రాహ్మణ మహిళా విభాగం అధ్యక్షురాలు మారుతిశర్మ పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలను పరిశీలించండి

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 27: హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ కిట్లను ఉపయోగించి చిన్నారుల ఎదుగుదలను ఇంటింటి తిరిగి పరిశీలించాలని డీఎం హెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తల కు డీఎంహెచ్‌వో హెచ్‌బీఎన్‌సీ డ్రగ్ కిట్లను అందజేశారు. ఆశా, ఏఎన్ఎం, హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ సందర్శనకు వెళ్లినప్పుడు పిల్లల ఎదుగుదలను పరిశీలించి వాటి వివరాలను ఈ-ఆశాలో సబ్మిట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో ఇందిర, డీసీఎం ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పునాది

ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు వి.శంకర్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 27: కార్య కర్తలే పార్టీకి పునాది అని, ఆశావహులు నిరుత్సాహ పడవద్దు...తప్పక న్యాయం జరుగుతుందని జాతీయ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడు వి.శంకర్ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం, సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశం డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వి.శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీలో అవకాశావాదులు పార్టీలు మారినా స్వచ్ఛమైన కార్యక ర్తలు మాత్రం మిగిలారని, అలాంటి వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుం దని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గాల అభ్యర్థులు మురళీకృష్ణ, జి రమేష్ యాదవ్, ఏ.నవీన్ కిషోర్, షేక్ జిలానీ బాషా, కాశీంవలి, డీసీసీ గౌరవాధ్యక్షుడు ఉండవల్లి వెంకటన్న, స్టాడింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరిసింహులు యాదవ్, ఎం.రామస్వామి, అనంత రత్నం మాదిగ, బీ.బతుకన్న, వినోద్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సేవాదళ్ జిల్లా అధ్యక్షు రాలు వెంకట సుజాత, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పార్కుకు భూములు ఇవ్వం

ఓర్వకల్లు, ఏప్రిల్ 27: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పార్కు నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. మా పొలంలో గ్రీన్ కో సోలార్ కంపెనీ సోలార్ ప్లాంటు వేసేందుకు గ్రామ పం చాయతీ తీర్మాణం, గ్రామ సభ జరగకుండా రైతులకు, ప్రజలకు తెలపలేద న్నారు. మళ్లీ గ్రామ సభ ఏర్పాటు చేసి సోలార్ ప్లాంటు వద్దు అని తీర్మాణం రద్దు చేస్తూ హైకోర్టులో గ్రీన్ కో వారికి కేసులు వేశారన్నారు. గ్రీన్ కో ఎటువంటి ఆధారాలు చూపకుండా దౌర్జన్యంగా ఉయ్యాలవాడ గ్రామ పొలాల్లో పార్కు మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. హైకోర్టులో ఈ కేసు పూర్తయ్యేంత వరకు గ్రామాలోని పొలాలకు రావద్దని, కోర్టు కూడా స్టేఆర్డర్ ఇచ్చిందన్నారు. రైతులకు తాము అండగా ఉంటామని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 27: కోడుమూరు-కర్నూలు రహదారిలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కామార్తి శేఖర్ (46) గూడూరులో ఓ పెట్రోలు బంకులో పని చేసే వాడు. శనివారం ఉదయం స్కూటీపై గూడూరుకు బయలుదేరాడు. కర్నూలు రహదారిలో కాల్వ దగ్గర ఎదురుగా వస్తున్న బొలొరో వాహనం స్కూటీని ఢీకొట్టింది. దీంతో శేఖర్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి ముందు.. బొలెరో ముందుగా వెళ్తున్న ఓ బైక్‌ను కూడా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై విధులకు వెళ్తున్న పోతుగల్లు వీఆర్వో వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ఆయ నను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోవడంతో భార్యాపిల్లలు శోకసంద్రంలో మునిగి పోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 27: పాతనగరంలోని మెయిన్‌బజార్ (పేట) లోగల ఏకాంత రామాలయంలో కొనసాగుతున్న ఆలయ 99వ వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చైత్ర బహుళ చవితిని పురస్కరించుకొని ఉదయం 10.30 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య, వందలాది భక్తులు వీక్షించుచుండగా, మంగళవాయిద్యాల మధ్య సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం ఏకాంత రామాలయం నుంచి స్వామి, అమ్మవారు, లక్ష్మణ, హనుమ సేమేత ఉత్సవ మూర్తులతో నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువ చేసింది. వందలాది భక్తులు, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. వీహెచ్‌పీ నాయకులు సాయిరెడ్డి, గోరంట్ల రమణ రథోత్సవానికి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో దినేష్, ఆలయ ప్రధాన అర్చకుడు రామమూర్తి ఆచార్య, విద్యానిధి ఆచార్య, సత్యప్రియ, వీహెచ్‌పీ నాయకులు ప్రాణేశ్, మాళిగి భానుప్రకాశ్, ఈపూరి నాగరాజు, గోవిందరాజులు పాల్గొన్నారు.

కోడుమూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



ముడుమాలలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్, ఏప్రిల్ 27: కోడుమూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా నని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుక బడి ఉందన్నారు. ఆయన వెంట టీడీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఈరన్నగౌడు, మల్లికార్జున గౌడు, హను మంతుగౌడు, సూరి ఉన్నారు.

టీడీపీలో చేరిన అంబేడ్కర్‌నగర్ వాసులు



టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 27: కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవ రపాడు గ్రామంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యక ర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామ సర్పంచు ఎం.మాధవస్వామి, రాముడు, శంకర్, కృష్ణబాబు ఆధ్వర్యంలో దాదాపు వంద మంది కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి విష్ణు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ విధ్వంస పాలనను అంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారిలో సుధాకర్ రెడ్డి, కబీర్, జేసుదాసు, రవి, దాసు, చిన్న తిమ్మప్ప, పెద్దనరసింహులు, మస్తాన్, రసూల్, పెద్దరాజు, సీపీఎం యేసన్న ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామకృష్ణ, లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, సుంకన్న, రంగయ్యలు టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నిక ల్లో టీడీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా విష్ణు నాయక త్వంలో పనిచేస్తామని సంపూర్ణ మద్దతు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 27: ప్రజల దాహార్తి తీర్చేందుకు నగరంలో చలివేంద్రాన్ని ప్రారంభించామని రెవరెండ్ ఆర్ఆర్ డీ. సంజీవరాజ్ అన్నారు. శనివారం కల్వరీ టెంపుల్ వ్యవస్థాపకుడు డాక్టర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సీ. క్యాంప్ టెంపుల్ ఆఫీసు వద్ద ఉచితంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రెవరెండ్ ఆర్ఆర్ డీ. సంజీవరాజ్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగరంలోని చర్చి సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెవరెండ్ సంజీవరాజ్

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

జాతీయ రహదారి దుస్థితి పై స్పందించిన ఎస్ఐ

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆలూరు, ఏప్రిల్ 27: ఆలూరు ఆదోనికి వెళ్లే జాతీయ రహదారి మరమ్మతు పనులు నిలిచిపోవడంతో గుంతల మయంగా మారింది. దీంతో ఆ మార్గం మీదుగా బళ్లారి, గుంతకల్‌కు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "ఆలూరంటే అలుసే... నిలచిన పోయిన జాతీయ రహదారి పనులు..." అనే కథనానికి స్పందించి ఆలూరు ఎస్ఐ ఓబులేష్ స్పందించారు. శనివారం తన సిబ్బందితో కలసి జాతీయ రహదారిలో తాత్కాలికంగా గరుసు వెయ్యించి మరమతులు చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఓబులేశ్‌కు ప్రజలు, వాహనదారులు అభినందనలు తెలిపారు.

పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

ఆదోని టౌన్, ఏప్రిల్ 27: ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొంటున్న వివిధ పార్టీల అభ్యర్థులు పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన అవసరం ఉందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) రాష్ట్ర నాయకురాలు విమలక్క, పీఓడబ్ల్యూ (స్త్రీవిముక్తి) రాష్ట్ర నాయకురాలు సుజ్ఞానమ్మ, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగన్న, ఆదోని అర్బన్ డెవలప్మెంట్ అసోసియేషన్ కన్వీనర్ ఆదినారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలో జరిగిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ ఆదోని డివిజన్ గుండా తుంగభద్ర నదితో పాటు లో-లెవెల్ కెనాల్ పారుతున్నా ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందక అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపార రీత్యా రెండవ ముంబాయిగా పేరు పొందిన ఆదోని పట్టణంలో అనేక భారీ పరిశ్రమలు మూతపడి, వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. సాగునీరు లభించక రైతులతో పాటు రైతు కూలీలు ఉపాధి కోసం వలసల బాట పట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పశ్చిమ ప్రాంత అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి, అనేక ఉద్యమాలతో పశ్చిమ ప్రాంత ప్రజలను మేలుకొలుపేలా అనేక కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నామని వివరించారు. సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇచ్చేలా ప్రజలు నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఆదోని జిల్లా ఏర్పాటుతో పాటు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, వలసల నివారణ, ఉపాధి కల్పన, పరిశ్రమల స్థాపన, విద్యా ప్రణాళికల అంశాలపై నిర్దిష్ట హామీ తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. సమావేశంలో రవివర్మ (రాయలసీమ కో-ఆర్డినేషన్ కమిటీ) తిరుమలేష్ (పీడీయస్‌యూ), బసవరాజ్ (ఏపీఆర్‌సీయస్) కరీం బాషా, బోయ సుంకన్న పాల్గొన్నారు.

ఆడబిడ్డలను విమర్శించడం తగదు

మద్దికెర, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి తన సొంత చెల్లెలు అని కూడా చూడకుండా ఆడబిడ్డను సైతం విమర్శించడం తగదని తాలుకా టీడీపీ మహిళా అధ్యక్షురాలు జానకీ చౌదరి అన్నారు. శనివారం మద్దికెరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి తన సొంత బాబాయిని హత్య చేసిన వారిని వెంట వెనుకేసుకుని తిరుగుతున్నారని చెల్లెళ్లు షర్మిళ, సునీత విమర్శిస్తే.. వారికి సమాధానం చెప్పేదిపోయి.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. కొడుకు వివాహానికి ఆమె చంద్రబాబు ఇంటికి వెళితే.. పచ్చ చీర కట్టుకుందంటూ విమర్శించడం విడ్డూరం అన్నారు. సీఎం జగన్ గులకరాయి డ్రామాను ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలను ప్రజలు తెలుసుకుని టీడీపీని గెలిపించాలని కోరారు.

జగన్ పోవాలి..బాబు రావాలి : సోమిశెట్టి

చిప్పగిరి, ఏప్రిల్ 27: జగన్ పాలన నుంచి విముక్తి పొందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చిప్పగిరిలోని ఎంపీటీసీ సభ్యురాలు ఎల్లంకి రజిని ఇంట్లో చిప్పగిరి మండల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పుల పాలయిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, యువత ఉపాధి కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనికిరాని వాడిగా ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. ఈసారి ఏపీలో 150 ఎమ్మెల్యే సీట్లు, ఎంపీ 22 అభ్యర్థులు గెలిచి విజయ ఢంకా మోగించడం ఖాయమని స్పష్టం చేశారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మీనాక్షి నాయుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు వెంకటేశు, రజని, నాగరాజు కోనంకి మహేష్, తిమ్మయ్య, రవి యాదవ్, పురుషోత్తం, రామాంజనేయులు, సురేష్, మాజీ ఎంపీటీసీ నరసింహులు పాల్గొన్నారు.

50మందిపై బైండోవర్ కేసులు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్27: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలం వ్యాప్తంగా మొత్తం 50 మందిపై శనివారం బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ శేషారెడ్డి ఎదుట హాజరు పరిచామని పేర్కొన్నారు.

బాబు సభకు భారీగా తరలిరండి

- నేడు కౌతాళంలో చంద్రబాబు ప్రజాగళం బహిరంగ సభ
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 27: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కౌతాళంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారని, కూటమి కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. చంద్రబాబు పర్యటన ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌతాళంకు వస్తున్నారని, ఇప్పటికే హెలిప్యాడ్, సభా మైదానం సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ సభకు నియోకవర్గంలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు, మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన సైనికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సభకు వచ్చే కూటమి అభ్యర్థులు 3 గంటలలోపు సభా వేదికకు చేరుకోవాలన్నారు. వైసీపీ ఆగడాలను, రౌడీయిజాన్ని ఎదుర్కొని సభా సమావేశానికి భారీగా తరలివచ్చి మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త తరలిరావాలని కోరారు. టీడీపీ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, చావిడి వెంకటేశ్, గువ్వలభీమన్న, మల్లికార్జున, నర్సారెడ్డి, బసలదొడ్డి ఈరన్న, జ్ఞానేష్, అంజనేయులు, ముత్తురెడ్డి, మాలపల్లి లక్ష్మయ్య, రామక్రిష్ణ, పవన్, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, భీమయ్య, మేకల వెంకటేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

రౌడూరులో వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరిక

కౌతాళం : రౌడూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తల 15 కుటుంబాలు మండల టీడీపీ నాయకుడు ఉలిగయ్య ఆధ్వర్యంలో ఎన్డీఏ ఉమ్మడి కూటమి టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి సమక్షంలో టీడీ పీ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రాఘవేంద్ర రెడ్డి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకు పార్టీపై జానాధారణ పెరగడంతో పార్టీలోకి ప్రజలు స్వచ్ఛందంగా చేరుతున్నారని తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన ముత్తన్న, పరసప్ప, ఈరన్న, భీమన్నలు మాట్లాడుతూ వైసీపీ విధానాలు నచ్చక పార్టీలో తమకు సరైన గుర్తింపులేక పోవడంతో టీడీపీ విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు బుడుదొడ్డి, యళ్లయ్య ఉన్నారు.


1రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న రౌడూరు వైసీపీ నాయకులు

వైసీపీ ముస్లింలకు చేసిందేమీలేదు

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానాముస్తాక్ అహ్మద్


ముస్లింలతో మాట్లాడుతన్న మౌలానాముస్తాక్ అహ్మద్

ఎమ్మిగనూరు , ఏప్రిల్27: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు సీఎం జగన్ చేసిందేమీలేదని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ అధ్యక్షుడు మౌలానాముస్తాక్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని 9 వార్డు కమిటి వీధి, కబరస్తాన్ కొట్టాల ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఇచ్చిన హామీల్లో జగన్ ఒక్కటి కూడా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన దుల్హాన్ పథకాన్ని తొలగించి పేద ముస్లింలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి ఒక్క చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలపించండని కోరారు. ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు ఉసేన్‌పీరా, తురేగల్ నజీర్, సలాం, రహిమాన్, రంజాన్, వార్డు ఇన్‌చార్జి కటారి రాజేంద్ర పాల్గొన్నారు.

దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమ కేసులు తప్ప

అభివృద్ధేది?

- వైసీపీపై చార్జిషీట్ విడుదల చేసిన బీవీ, బీజేపీ, జనసేన నాయకులు
- టీడీపీలో చేరిన మసీదుపురం గ్రామ వైసీపీ నాయకులు
- 1వ తేదీన పెన్షన్లు ఇవ్వాలి : టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వర రెడ్డి


వైసీపీపై చార్జిసిట్ విడుదల చేస్తున్న టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు/ రూరల్, ఏప్రిల్27: ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ అధికారం చేపట్టిన జగన్ ఐదేళ్లలో దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమ కేసులుతప్ప రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, జనసేనా నాయకుడు సురేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహులు సవాల్ విసిరారు. జగన్ రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగించి ప్రజల ధన, మాన, ప్రాణాలను దోచుకొని అరాచక పాలన సాగించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎన్డీయే కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎంపీడీవో కొండన్న ను కలిసి 1వ తేదీ లబ్ధిదారులకు పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం 'అరాచక పానల అంతం.. కూటమి పంతం' అంటూ జగనాసుర రక్తచరిత్రపై ఎన్డీయే కూటమి రూపొందించిన చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ఎక్కడచూసినా దౌర్జన్యాలు, దోపిడీలకు పాల్పడడంతో పాటు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపారని గుర్తుచేశారు. జనానికి ఈ ఐదేళ్ల కాలంలో విషపూరిత మద్యం పోసి 35లక్షల మంది ఆరోగ్యం పాడు చేసి 30వేల మంది మాంగళ్యాలను మంటకలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.75వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. ఇసుక ధరను నాలుగు సార్లు పెంచి భవన నిర్మాణ కార్మికులు రూ.40లక్షల మందికి ఉపాధి లేకుండ చేసి వారి పొట్టలు కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచించి ఓటు వేసి భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1వ తేదీనాడే లబ్ధిదారులకు పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ప్రతిపక్షాలపై ఆరోపణలు చేస్తూ వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు శ్రీరాములు, జనసేనా నాయకులు నాగరాజు, దామోదర్‌రెడ్డి, భాస్కర్, టీడీపీ నాయకులు నజీర్, సురేష్‌చౌదరి, హనుమంతు, మసీదుపురం రంగస్వామి, రాఘవేంద్ర, రాఘవేంద్ర, చెన్నాపురం నాగరాజు, హరి, అజామ్ లతో పాటు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోనెగండ్ల మండలంలో విస్తృత ప్రచారం



గోనెగండ్ల : మండల పరిధిలోని వేముగోడు, తిప్పనూరు, బోదేపాడు గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ప్రజలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గ్రామాల వీధుల్లో టీడీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు, నిరుద్యోగ యువతకు, మహిళలకు అభివృద్ధి ఫలాలు అందుతాయని భరోసా ఇచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, కులుమాల రాముడు, చాంద్‌బాషా, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రంగస్వామినాయుడు, రాంపురం రఫీక్, రమేష్‌నాయుడు, నూరహమ్మద్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మసీదుపురం వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు మండల పరిధిలోని మసీదుపురం గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కందనాతి కేశన్న, సోమేశ్వరరెడ్డి, డీలర్ ఈరన్న, వీరాంజనేయులు, మసీదుపురం రంగస్వామి, రఘు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన మసీదుపురం గ్రామ వైసీపీ నాయకులు

జగన్‌కు జైలు జీవితం తప్పదు..

- ఒక్కచాన్స్ అంటూ రాష్ట్రాన్ని రావణకాష్టగా మార్చారు
- రాజధానిలేదు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు
- జగన్‌కు బుద్ధిచెప్పేందుకు జనం సిద్ధం
- టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

ఆలూరు, ఏప్రిల్ 27: రాష్ట్రాన్ని దోచుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి జైలు జీవితం తప్పదని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం రాత్రి ఆలూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో ఇసుక, మద్యం, గంజాయి మాఫియాలను ప్రోత్సహించారన్నారు. వైసీపీ నాయకులు భూకబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని పందికొక్కుల్లా దోచుకున్నారన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తానని విఫలమయ్యారని విమర్శించారు. నిరుద్యోగుల కోసం ప్రతియేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని దగా చేశారన్నారు. డీఎస్సీ నిర్వహిస్తానని చెప్పి, ఆ ఊసే ఎత్తకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని, దౌర్జన్యాలకు పాల్పడుతూ టీడీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టి ఆత్మహత్యలకు కారణం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టీడీపీకి పట్టం కట్టాలని, చంద్రబాబును సీఎంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని రంగాలను, వర్గాలను విస్మరించిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా జగన్ నిర్లక్ష్యం చేసి, రైతులను బిక్షగాళ్లుగా చేశారన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్లు వల్లి, పరామరెడ్డి, సుధాకర్, రాష్ట్ర నాయకులు నారాయణ, నెట్టప్ప, జిల్లా నాయకులు నరసప్ప, నాగరాజు, కొమ్ము రామాంజనేయులు, సురేంద్ర, మండల నాయకులు పాల్ రెడ్డి, మద్దిలేటి, ముద్దురంగ, నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్, ఈరన్న, రామ్మూర్తి, గూళ్యం రామాంజనేయులు, రాము, బీజేపీ నాయకులు బసవరాజు, జనసేన నాయకులు చత్రపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పత్తికొండకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాక

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 27: ఇండియా కూటమి బలపరుస్తున్న సీపీఐ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి రామచంద్రయ్య, కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం పత్తికొండ నియోజకవర్గంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరలుతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దికెరలో ఉదయం 8 గంటలకు ప్రచార సభ ప్రారంభమవుతుందని, అనంతరం పెరవలి, తుగ్గలి మండలంలో జొన్నగిరి, వెల్దుర్తి మండలంలో రామక్రిష్ణ వివిధ ప్రచార సభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయన పర్యటనను పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

చిప్పగిరి కస్తూరిబాలో విచారణ

చిప్పగిరి, ఏప్రిల్ 27: స్థానిక కస్తూరిబా పాఠశాలలో జిల్లా అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ సౌజన్య, అక్కడ పనిచేస్తున్న కొందరు బోధన సిబ్బంది మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు సునీత, విజయకుమారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కస్తూరిబా పాఠశాలలో 300 విద్యార్థులు చదువుతన్నారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చక్కటి బోధన అందించడంతో దాదాపు 12 ఏళ్ల నుంచి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ 12 మంది ఉపాధ్యాయులు సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రిన్సిపాల్, సిబ్బంది మధ్య ఏర్పడ్డ విభేదాల కారణంగా కస్తూరిబా ప్రగతి దెబ్బ తింటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. 'తనపై లేనిపోని అసత్యపు ఆరోపణలు చేస్తూ, కులవివక్షత చూపుతూ.. విద్యార్థుల చేత బలవంతంగా కొందరు సిబ్బంది అసత్యాలను, సత్యాలుగా మలచేందుకు ప్రయత్నిస్తున్నారని' ఆరోపించారు. తనపై చేసిన అసత్యపు ఆరోపణలు, అధికారులు రెండువైపులా నిజానిజాలు పరిశీలించాలని కోరారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

దేవనకొండ, ఏప్రిల్27 : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ తనయుడు గిరిమల్లేష్‌గౌడ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, జనసేన పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో మండలంలోని పాలకుర్తి, లక్కందిన్నె, గుమ్మరాళ్ల బి.సెంటర్ గ్రామాల్లో శనివారం విస్త ృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బడిగింజల రంగన్న, రామచంద్రనాయుడు, ఉచ్చీరప్ప, బోడ రవి, మల్లికార్జునరెడ్డి, మలకన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, రాజాసాబ్, మస్తాన్, సరోజ, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరుతున్న లక్కందిన్నె గ్రామస్థులు

లక్కందిన్నెవాసులు టీడీపీలో చేరిక

మండలంలోని లక్కందిన్నె గ్రామ వైసీపీ నాయకుల 50 కుటుంబాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ తనయుడు, యువనేత గిరిమల్లేష్‌గౌడ్, జనసేన పార్టీ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్పల సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువాలేసి ఆహ్వానించారు.

సైకో పోవాలి.. సైకిల్ రావాలి..

తుగ్గలి, ఏప్రిల్ 27: జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రం అధోగతి పాలైందని, సైకో పోయి.. సైకిల్ రావాలని, అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మండలంలోని రాంపురం, జొన్నగిరి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి, గిరిజనతాండాలు, ఆర్.కొట్టాల గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు ప్రచార రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పత్తికొండ వెనుకబడిన ప్రాంతమని, పూర్తిగా కరువు కాటకాలతో అల్లాడుతోందని, కనీసం కరువు మండలంగా కూడా వైసీపీ ప్రభుత్వం ప్రకటించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. అన్ని చెరువులకు నీరు నింపడంతో పాటు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు రుణ సౌకర్యాలు కల్పించి కుటుంబం ఎదుగుదల కోసం పాటు పడుతామన్నారు. చంద్రబాబుకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని అన్నారు. ఎన్నికల్లో టీడీపీ తరుపున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, వెంకటస్వామి, తిరుపాల్ నాయుడు, చంద్రశేఖర్‌రావు, వెంకట్రాముడు చౌదరి, అప్పా వేణుగోపాల్, బాలన్న, లక్ష్మణస్వామి యాదవ్, రామూ నాయక్, నాగరాజు, శంకర్ నాయక్, భీమలింగప్ప చౌదరి, మల్లయ్య, బలరాముడు, మల్లి, తులసి నాయక్, గోవింద నాయక్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగుడిలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు